క్లుప్తంగా

సైదాపురం వైద్యాధికారిగా ప్రశాంతి



సైదాపురం: మండల వైద్యాధికారిణిగా డాక్టర్ ప్రశాంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యులు జనార్థన్ యల్లాయపాళెం ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారు. గూడూరులో పనిచేస్తున్న డాక్టర్ ప్రశాంతిని సైదాపురానికి బదిలీ చేశారు. అనంతరం ఆమె సిబ్బందితో పలు అంశాలపై చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

డీవీ సత్రం రైల్వే స్టేషన్ కన్సల్టింగ్ మెంబర్స్ ఎంపిక



డీవీ సత్రం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులుతో కన్సల్టింగ్ మెంబర్స్

దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల దక్షిణ మధ్య రైల్వే స్టేషన్ కన్సల్టింగ్ మెంబర్స్‌గా సీహెచ్ వెంకటరమణయ్యనాయుడు, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, సురేష్‌నాయుడు, తిరుపాల్‌నాయుడును ఎంపిక చేశారు. వీరు మంగళవారం డీవీ సత్రం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. సమస్యలను రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

ఆడపిల్లలను చదవనిద్దాం

చిల్లకూరు : ఆడ పిల్లలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ పిలుపునిచ్చారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం కింద తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు దాటిన వెంటనే పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. ఆడ పిల్లలను బడికి పంపేలా చూడాలని కోరారు. కొంతమంది ఆడ పిల్లలకు 12 ఏళ్లు దాటకుండానే పెళ్లి చేస్తున్నారని, అది మంచిది కాదన్నారు. అనంతరం పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్త, క్రిష్ణమ్మ, హెల్పర్ భవాని పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



బాలామృతం అందజేస్తున్న సీడీపీవో

దక్కిలి: బాల్య వివాహాలు నేరమని, వాటిని అరికట్టడం అందరి బాధ్యతని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. ఆమె మంగళవారం కమ్మపల్లి ఎస్టీ కాలనీ, కమ్మపల్లి మెయిన్, రామచంద్రాపురం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. స్టాక్‌ను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, సుజాత, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కంప్యూటర్లు వితరణ



కంప్యూటర్లను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు వితరణ చేశారు. నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెసల జయరాజగోపాల్ ఆధ్వర్యంలో బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్, వర్జీనియా(యూఎస్ఏ) వారి దాతృత్వంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, అధ్యాపకులు, రోటరీ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై దృష్టి సారించాలి

బాలాయపల్లి(సైదాపురం) : చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో వెంకటరమణ తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా మంగళవారం బాలాయపల్లిలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వినీల్‌కుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్కపై తమ్ముడి దాడి

శ్రీకాళహస్తి: పెద్దమసీదు వీధిలో నివాసం ఉంటున్న సహీనా(26)పై హుస్సేన్(22) సోమవారం మద్యం మత్తులో దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. సహీనా తల్లిదండ్రులు చనిపోయిన తరువాత హుస్సేన్ తల్లిదండ్రులు ఆమెను పెంచిపెద్ద చేశారు. ఆమె వివాహ అనంతరం హుస్సేన్ తల్లిదండ్రులు చనిపోయారు. తమ అక్క సహీనాను తన తల్లిదండ్రులు బాగా చూసుకున్నారని, ఆమె ఇప్పుడు తనను పట్టించుకోవడంలేదని గొడవ పడేవాడు. తనకు వివాహం అయింది. నేను ఎలా నీకు చేసేది అని వారిద్దరి మధ్య తరచూ వాగ్వాదం జరిగేది. సోమవారం హుస్సేన్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఒకటో పట్టణ సీఐ గోపి కేసు నమోదు చేశారు.

ధాన్యానికి ధర కరువు

- తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు
- రైతుల శ్రమను దోచుకుంటున్న దళారులు
- పట్టించుకోని అధికారులు



కల్లాల్లోనే విక్రయిస్తున్న వరి ధాన్యం

పెళ్లకూరు: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడం లేదు. దళారులు వ్యాపారులతో కుమ్మక్కై సరైన ధరలు లభించకుండా చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో 1500 మందికి పైగా రైతులు ఖరీఫ్ సీజన్‌లో 2,286 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఎకరాకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అయ్యింది. వర్షపాతం తక్కువ కావడం, తెగుళ్లు ఎక్కువగా ఆశించాయి. అధికారులు పంటలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వలేదు. రైతులు ఎరువుల దుకాణాల వారు సూచించిన మందులు పిచికారీ చేయడంతో పంట దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. సాధారణంగా ఎకరాకు 50 బస్తాల దిగుబడి వస్తుంది. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, తెగుళ్లు తదితరాల వల్ల 40 నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చింది. కష్టాలు పడి పండించిన ధాన్యానికి ధరలు లేవంటూ దళారులు దోచుకుంటున్నారు. రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది. అలాగే రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు అన్ని వివరాలు అందించేందుకు తీసుకువచ్చిన 13 రైతు సంక్షేమ కార్యాలయాలు అలంకారప్రాయంగా మారాయి. దళారులు ధాన్యానికి మార్కెట్ ధర లేదంటూ రైతులను నిలువుదోపిడి చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్ఎల్ఆర్ జిలకర రకం 75 కేజీల ధాన్యం బస్తా రూ.18000 నుంచి రూ.1900 వరకు ఉంది. దళారులు రూ.1710, 1010 రకం ధాన్యం రూ.1620లకు కొనుగోలు చేస్తున్నారు. తూకాలలోనూ మోసం చేస్తున్నారు. కత్ర తూకాలతో 75 కేజీల ధాన్యం కొనుగోలు చేసి మూడు కేజీలు నెమ్ము, కేజీ గోతాము కింద తరుగు తీసివేసి 69 కేజీలకు నగదు చెల్లిస్తున్నారు.

అధికారులు జాడ లేదు



కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు పలుమార్లు తిరిగినా తాళం వేసి ఉన్నారు. కనీసం సమాధానం చెప్పేవారు కూడా లేరు. అందువల్ల ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. దళారులు తాము చెప్పిందే వేదం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. – మురళి, రైతు, చావలి

దళారులకే విక్రయిస్తున్నాం



గతంలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేది. ప్రస్తుతం ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కనీస మద్దతు ధరను కూడా ప్రభుత్వం ప్రకటించలేదు. దీంతో దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోంది. కనీసం ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి టార్పాలిన్ పట్టలు కూడా ఇవ్వలేదు. – తిరుపాలు, రైతు, ఆర్లపాడు

ప్రభుత్వం అనుమతులిస్తే కొనుగోలు చేస్తాం

మండలంలోని పలు ప్రాంతాల్లోని రైతులు వరికోతలు చేపట్టారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. మద్దతు ధర పొందేలా అధికారుల సూచనలు పాటించాలి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలును చేపడతాం. – డాక్టర్ ప్రవీణ, ఏవో, పెళ్లకూరు

ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ



పాతనాలపాడులో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

దక్కిలి: మండలంలో ఉపాధి హామీ కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులను వారం రోజుల నుంచి తనిఖీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఉపాధి హామీ ఎస్సార్పీ (స్టేట్ రిసోర్సుపర్సన్) వెంకయ్య, డీఆర్పీలు పాతనాలపాడులో (కమ్మవారిపల్లి) జరిగిన ఉపాధి పనులను పరిశీలించారు. పనుల తనిఖీ అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని ఎస్సార్పీ తెలిపారు.

వీల్ చైర్ల పంపిణీ



పిల్లలకు వీల్ చైర్లు అందజేస్తున్న ఐఈఆర్టీలు

దక్కిలి: స్థానిక భవిత కేంద్రంలో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు గల ఇద్దరు పిల్లలకు మంగళవారం వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఈఆర్టీలు బీ కేస్మసామ్య, ఓ బాలమేరి మాట్లాడుతూ ఏఎల్ఐఎంసీఓ శాఖ సహకారంతో మండలంలోని వెంబులూరు గ్రామానికి చెందిన జీ అమృత, ఎస్ గణేష్‌కు వీల్‌చైర్లు అందజేసినట్లు చెప్పారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పాడి రైతులకు పశువుల దాణా అందజేస్తున్న పశు వైద్యులు

గూడూరు రూరల్ : పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు గణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గూడూరు రూరల్ పరిధిలోని కాంద్ర గ్రామంలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 69 పశువులకు పరీక్షలు చేసి దాణా అందజేశారు. పశువైద్యులు పి.సుదర్శన్, బి.సురేష్, టి.సోమయ్య, నాయకులు కొండూరు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

కందిపప్పు లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

తడ: చెన్నై నుంచి కాకినాడకు ముడి కందిపప్పు లోడుతో వెళుతున్న లారీ మంగళవారం తెల్లవారుజామున పొలాల్లోకి దూసుకువెళ్లి సుమారు 10 అడుగుల లోతులోకి బోల్తా పడింది. లారీ తీవ్రంగా దెబ్బతిన్నా డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధే ధ్యేయం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు,



దక్కిలి: సర్పంచులు, కార్యదర్శులకు వర్మీకంపోస్టుపై అవగాహన

సైదాపురం: పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ ఆదేశించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా మంగళవారం కొమ్మపాడులో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తేనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం నిర్వహించేలా ఒక్కో పంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు వెచ్చిస్తోందన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ ఏడుకొండలు, శిక్షణ నిర్వాహకులు జిలానీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలతో ఉపయోగం

ఓజిలి: చెత్తసంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి ఎరువులను తయారు చేసి వచ్చిన ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఈవోపీఆర్డీ మోహన్ తెలిపారు. ఆయన మంగళవారం సర్పంచులు, కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా రెండో రోజు కురుగొండలోని చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు మరమ్మతులు చేయించాలని సర్పంచులను ఆదేశించారు. కార్యదర్శులు సిరాజ్, రేణుక, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణ కొనసాగుతోంది. రెండో రోజు మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఏకొల్లు గ్రామంలోని సంపద తయారీ కేంద్రానికి తీసుకువెళ్లి వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని చెత్తను సేకరించి వర్మీకంపోస్టు తయారు చేసి సంపద పొందడాన్ని వివరించారు. పర్యవేక్షురాలు రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురామయ్య, వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, డీఎల్‌పీఓ, ఈఓపీఆర్‌డీ పాల్గొన్నారు.

తడలో..

తడ: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ రెండో రోజు మంగళవారమూ కొనసాగింది. ఇందులో ఏపీఎస్ఐఆర్‌డీ జిల్లా అబ్జర్వర్ గండికోట రాజ్యలక్ష్మి పాల్గొని పంచాయతీల నిర్వహణ, అభివృద్ధి తదితర విషయాల్లో సర్పంచ్‌ల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం కాదలూరు పంచాయతీలో చెత్త సంపద కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీపీ కె.రఘురెడ్డి, సూళ్లూరుపేట డీఎల్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు దృష్టి పెట్టాలని ఈవోపీఆర్డీ అల్లాబక్షు తెలిపారు. మోపూరు వెల్లంపల్లి పంచాయతీలో ఉన్న చెత్త సంపద కేంద్రం వద్ద మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ ఇచ్చారు. లింగసముద్రం, డి.వడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శులు వెంకటాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ : పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా మంగళవారం మేనకూరులోని చెత్త సంపద కేంద్రంలో తడి, పొడి చెత్త ద్వారా వర్మీకంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అబ్జర్వర్ గండికోట రాజ్యలక్ష్మి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్మీకంపోస్టుతో అదనపు ఆదాయం పొందాలన్నారు. అనంతరం రాజ్యలక్ష్మిని ఘనంగా సన్మానించారు. సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ భువనేశ్వరశర్మ, మేనకూరు పంచాయతీ కార్యదర్శి ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దొరవారిసత్రం : సంపద తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



నాయుడుపేటలో..



తడలో..



ఓజిలిలో..

ఘనంగా హర్ ఘర్ తిరంగా



గూడూరు : జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రాపూరు: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రాపూరులో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తిని పెంపొందించేందుకు ర్యాలీలు, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసులు, జిలానీ, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఉపాధ్యాయురాలు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను గౌరవిద్దాం

గూడూరు రూరల్ : జాతీయ జెండాను గౌరవించి ప్రతి ఒక్కరూ దేశ భక్తిని చాటుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు కోరారు. గూడూరు రెండో పట్టణంలోని వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ జాతీయ జెండాతో కోర్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్పీఎఫ్ సీఐ గురులాల్ మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు. అలాగే భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాల నుంచి కోర్టు సెంటర్ వరకు జాతీయ జెండాలను ర్యాలీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, శివశంకర్, జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ నవకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రాపూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



నాయుడుపేట టౌన్ : జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలి

నాయుడుపేట టౌన్ : హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని కమిషనర్ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం సాయంత్రం మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయల కార్యదర్శులు, మెప్మా ఆర్‌పీలు, పొదుపు మహిళలతో ఇంటింటా జాతీయ జెండాపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజా మొహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మల్లమ్మగుంట పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు



దొరవారిసత్రం : విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

రాపూరు: విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈవో శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన మంగళవారం మల్లమ్మగుంట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం దొరసానమ్మ, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

దొరవారిసత్రం : మండలంలోని అక్కరపాక ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఎంఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

ఉపాధి హామీలో టీడీపీ నేతల పెత్తనం

బాలాయపల్లి(సైదాపురం) : ఉపాధి హామీ పనుల్లో టీడీపీ నేతల పెత్తనం చేస్తున్నారు. మేట్లతో కలిసి పనులు చేయకుండా ఇంటి వద్ద ఉన్న తమ వారి పేర్లను మస్టర్లలో నమోదు చేస్తున్నారు. దీనిపై కూలీలు మంగళవారం పిగిలాంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. కూలీలు మాట్లాడుతూ పిగిలాం పంచాయతీలో టీడీపీ నేతల కనుసన్నల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి మేట్లు టీడీపీ నాయకులతో కుమ్మక్కై పనులు చేయకుండా ఇంటి వద్ద ఉన్న 20 మంది పేర్లను మస్టర్లలో నమోదు చేశారని విమర్శించారు. తాము పనులకు వస్తే ఇంటికి వెళ్లిపోవాలని మేట్లు ఆదేశించారని వాపోయారు. అర్హులైన తమకు పనులు ఎందుకు కల్పించరని ప్రశ్నించినందుకు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్హులైన కూలీలకు పనులు కల్పించాలని వారు కోరారు.

ఆటోలో పైపుల తరలింపు



చిల్లకూరు : ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతోపాటు లగేజీని తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. చిల్లకూరు పట్టణంలో వందల సంఖ్యలో ఆటోలు ఉన్నాయి. గ్రామాల నుంచి కూడా ఆటో డ్రైవర్లు పట్టణానికి వచ్చి వస్తువులను తరలిస్తున్నారు. ఆటోలో పైపులు, రాడ్లు తరలిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఆటో డ్రైవర్లను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితుడికి నగదు అందజేత



బాధితుడికి నగదు అందజేస్తున్న యువకులు

చిట్టమూరు(చిల్లకూరు) : బాధితుడికి నగదు అందజేసి శభాష్ అనిపించుకున్నారు కోగిలికి చెందిన యువకులు. చిట్టమూరు మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన రాజేష్‌రెడ్డి నాయుడుపేటలో వెయిట్‌లెస్ రాయిని కొనుగోలు చేసేందుకు రూ.30 వేలు తీసుకుని బయలుదేరాడు. కోగిలి ప్రాంతంలో నగదు రోడ్డుపై పడి పోయింది. అప్పుడే అటుగా వెళుతున్న కోగిలికి చెందిన యువకులకు ఆ నగదు దొరికింది. వారు వెంటనే ఆ విషయాన్ని గ్రూపుల్లో పోస్టు చేశారు. సాయంత్రానికి బాధితుడికి విషయం తెలియడంతో నేరుగా యువకులను సంప్రదించాడు. వారు నగదును ఆయనకు అందజేసి శభాష్ అనిపించుకున్నారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు





చికిత్స పొందుతున్న యువకులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలం కోనేటి రాజుపాళెం సమీపంలో మంగళవారం రాత్రి బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట మండలం భీమవరం గ్రామానికి చెందిన తుపాకుల మణి, సంతోష్ బైక్‌లో బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి మంగళవారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరారు. కోనేటి రాజుపాళెం సమీపంలో ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో మణి, సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. వారినిస్థానికులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి గూడూరు ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 5.942 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 5.942 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 110, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.